
# బ్రహ్మసూత్రములు- I

# - వేదవ్యాస మహర్షి (బాదరాయణులు)





: వ్యాఖ్యాత :

"అభినవ వ్యాస","జ్ఞానప్రపూర్ణ"

శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc(Ag)

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం : చిలకలూరిపేట.

Website : WWW.SRICHALAPATHIRAO.COM

Email : care@srichalapathirao.com

Contact : +91 80085 39770 / +91 98862 65225

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

# బ్రహ్మసూత్రములు- I

## విషయ సూచిక

పరిచయం.......................................................3

మొదటి సూత్రం ..........................................39

తృతీయాధ్యాయం - ప్రథమ పాదం:

........Error! Bookmark not defined.58

తృతీయాధ్యాయం - ద్వితీయపాదం.....140

Sample: WWW.SRICHALAPATHIRAO.COM

# బ్రహ్మ సూత్రములు

**ఓం సదాశివ సమా రంభాం**

**శంకరాచార్య మధ్యమాం**

**అస్మదాచార్య పర్యంతాం**

**వందే గురు పరంపరాం ||**

**వందే గురు పరంపరాం ||**

**బ్రహ్మ సూత్రములు**

# పరిచయం

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

ఈ లోకంలో జన్మించిన ప్రతిజీవి - ప్రతిప్రాణి తాను ఎలా సుఖంగా - సంతోషంగా జీవించాలా? అనే ఆలోచన చేస్తుంది. అందుకు అనుగుణంగా ప్రవర్తిస్తుంది. ఇక మానవుడు బుద్ధిజీవి గనుక బుద్ధితో ఎన్నో విషయాలను గురించి తెలివితో ఆలోచిస్తాడు. సుఖంగా జీవించాలంటే అనేక వస్తువులు కావాలి. విషయాలు కావాలి. భోగాలు కావాలి. అందుకు ధనం కావాలి. ఆ ధనాన్ని సంపాదించటానికి ఎన్నో ప్రణాళికలు వేస్తాడు. చదువుకొని ఉద్యోగాలు సంపాదిస్తాడు. లేదా ఏదో ఒక వృత్తిలో ప్రవేశిస్తాడు. వ్యాపారం చేస్తాడు. వ్యవసాయం చేస్తాడు. పరిశ్రమలు స్థాపిస్తాడు. రాజకీయాలలోకి దిగి పదవులు సంపాదిస్తాడు. వీలైతే న్యాయంగా సంపాదిస్తాడు.



care@srichalapathirao.com +91 8008539770/9538858115

వీలు కాకపోతే అన్యాయంగా - అధర్మంగా - అమాయకులను మోసం చేసైనా సంపాదిస్తాడు. సంపాదించే దానితో తృప్తి చెందకుండా ఇంకా ఇంకా సంపాదించటానికి ఏం చేయాలా? అని ఆలోచిస్తాడు. వృత్తిని మారుస్తాడు, వ్యాపారాన్ని మారుస్తాడు, ఉద్యోగాన్ని మారుస్తాడు, ఉన్న ప్రదేశాన్ని మారుస్తాడు. లేదా ఈ దేశంలో బాగా సంపాదించటం సాధ్యం కాదని మరో దేశానికి వెళతాడు. క్రొత్త క్రొత్త ప్రయోగాలు-స్నేహాలు చేస్తుంటాడు. నిరంతరం అన్వేషణ సాగిస్తూనే ఉంటాడు. తన చుట్టూ ఉన్నవారిలో ఎవరెవరు ఎంతెంత సంపాదించి, బాగా సుఖభోగాలను అనుభవిస్తున్నారో గమనిస్తాడు. వారిని అనుకరిస్తుంటాడు. ఇలా నిరంతరం మానవుడు ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. ఈ ప్రయత్నాలు సాగుతూనే ఉంటాయి. ఒక్కొక్కసారి తన ప్రయత్నం విజయవంతమైనప్పుడు ఆనందడోలికల్లో మునిగిపోతుంటాడు. అపజయం పొందినప్పుడు నిరాశానిస్పృహలలో మునిగిపోతుంటాడు. జీవితంలో ఎదురు దెబ్బలు తగిలినప్పుడో, అనుకోని అవాంతరాలు ఎదురైనప్పుడో, కష్టాలలో మునిగిపోయినప్పుడో, విరక్తి చెందినప్పుడో అతడికి అనేకమైన ఆలోచనలు వస్తుంటాయి.

*1. నేనెవరిని?*

*2. ఈ ప్రపంచం ఏమిటి?*

*3. దీనిని ఎవరు సృష్టించారు?*

*4. ఈ జీవుళ్ళంతా ఎక్కణ్ణించి వస్తున్నారు?*

*5. మరణించిన తరువాత ఎక్కడికి పోతున్నారు?*

*6. ఈ జీవుళ్ళు అసలు పుట్టటం ఎందుకు?*

*7. ఈ కష్టాలు, దుఃఖాలు పడటం ఎందుకు?*

*8. అసలు ఈ సృష్టిని ఎవరు చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు?*

*9. స్వర్గ నరకాలు ఉన్నాయా? ఉంటే ఎక్కడున్నాయి?*

*10. అసలు మానవులు చేయవలసిన దేమిటి?*

*11. మానవుని యొక్క అంతిమ లక్ష్యం ఏమిటి?*

*12. పాపపుణ్యాలు ఏమిటి?*

*13. మోక్షమంటే ఏమిటి? దానిని పొందితే ప్రయోజనమేమిటి?*

*14. జన్మలనేవి ఉన్నాయా?*

*15. అసలు ఎవరు మనకు మార్గదర్శకులు?*

ఇలా ఎన్నో ఆలోచనలు మానవునిలో మెదులుతూ ఉంటాయి. పురుగులా తొలుస్తూనే ఉంటాయి. వీటికి సమాధానంగానే తత్త్వశాస్త్రం పుట్టింది. వేదాలు, ఉపనిషత్తులు పుట్టాయి. అవే ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఇస్తాయి.

అనేకమంది మహాత్ములు, తత్త్వవేత్తలు, ఆత్మజ్ఞానులు అనేకరకాల ఆలోచనలు చేసి, వారి వారి అభిప్రాయాలను వెల్లడించారు. అవే వేరువేరు మతాలు - సిద్ధాంతాలు అయినాయి. మానవునిలో కలిగే జిజ్ఞాసకు, వారి సందేహాలకు సమాధానం ఇవ్వటానికి, ఆ మహాత్ములు ఎన్నో ప్రయత్నాలు చేశారు, చేస్తున్నారు, చేస్తూనే ఉంటారు.

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

ఉపనిషత్తులలో ఈ విధమైన చర్చలు, ప్రతిపాదనలు, అభిప్రాయాలు, సిద్ధాంతాలు కనిపిస్తున్నాయి. ఉపనిషత్తులనేవి నిజంగా ఒక దేశానికో, ఒక జాతికో, ఒక కాలానికో, ఒక మతానికో పరిమితమైనవి కావు. అవి ఈ విశ్వం మొత్తానికి, అన్ని జాతులకు, అన్ని మతాలకు, అన్ని కాలాలకు పరమ సత్యాన్ని చాటి చెప్పిన వేదాంత శాస్త్రాలు. వేదాలకు అంతంలో ఉన్న భాగాలు కనుక వేదాంతం అన్నారు. అసలు వేదమంత్రాలన్నీ ఎలా వచ్చినవి?

ప్రాచీనకాలం నుండి భారతీయులైన ఋషిపుంగవులు, మహాత్ములు, సర్వసంగ పరిత్యాగులు, మునీశ్వరులు - పరమ ప్రశాంతమైన ప్రదేశాలలో, ఏకాగ్రచిత్తంతో, ప్రగాఢధ్యానంలో దర్శించిన పరమ సత్యాలే ఈ వేదమంత్రాలు. వీటిని వారు విన్నారు. అందుకే వీటికి 'శ్రుతులు' అనే పేరు వచ్చింది. ప్రతి మానవుడు తప్పక తెలుసుకోవలసినవి గనుక వీటిని 'వేదం' అన్నారు. వేద అంటే తెలుసుకొనుట.

మొదట్లో వేదమంత్రాలన్నీ ఒక్కటిగానే ఉన్నాయి. మానవ జీవితాన్ని సార్థకం చేసుకొనుటకు తప్పక తెలుసుకోవలసిన ఈ వేదమంత్రాలన్నీ కుప్పలుతెప్పలుగా ఒక్కటిగా ఉండటంతో మొదటి రెండు యుగాలైన కృత త్రేతా యుగాలలోని మానవులు తమ ఆయుర్దాయం అధికంగా ఉండటం వల్ల తెలుసుకోగలిగారు. అప్పటి మానవులు అత్యధిక కాలం జీవించి యుండుటే గాకుండా వారు గొప్ప మేధాశక్తి

Sample: WWW.SRICHALAPATHIRAO.COM

గల బుద్ధిమంతులు గనుక వేదమంత్రాలను అధ్యయనం చేసి, అర్థం చేసుకోగలిగారు. కానీ ద్వాపరయుగం వచ్చేసరికి మానవుల ఆయుర్ధాయం *200* సం||లకు పడిపోయింది. కనుక వారికి ఈ వేదమంత్రాలను - వాటి అర్థాలను తెలుసుకోవటం అసాధ్యమయ్యింది. అందుకే ద్వాపరయుగం చివరిలో జన్మించిన వ్యాసుడు ఈ వేదమంత్రాలన్నింటిని ఒక క్రమపద్ధతిలో *4* వేదాలుగా విభాగించాడు. ఇలా వేదాలను విభాగించాడు గనుక ఆయన 'వేదవ్యాసుడ'య్యాడు. ఆ నాలుగు వేదాలే ఋగ్వేదం - యజుర్వేదం - సామవేదం - అధర్వణవేదం. సృష్టి, స్థితి, లయం, అధర్వుడు అనే ఆధారంగా తిరిగి ఈ నాలుగు వేదాలను ఒక్కొక్క దానిని మళ్ళీ *4*గా విభాగించాడు. అవే -

*1.* *సంహిత:* మంత్రభాగం. భగవంతుడు ఎక్కడో ఉన్నాడనే భావనతో ఆయనను స్తుతించే స్తోత్ర పాఠాలు ఇందులో ఉన్నాయి.

*2.* *బ్రాహ్మణములు:* భగవంతుడు ఎదురుగా ఉన్నాడనే భావనతో చేసే పూజాదికాలు యజ్ఞాయాగాదుల మంత్రాలు ఇందులో ఉన్నాయి.

*3.* *ఆరణ్యకాలు:* ఉపాసనకు సంబంధించిన విషయాలు. భగవంతుడు నీలోనే ఉన్నాడనే భావనతో చేసే ఉపాసనలు ఇందులో ఉన్నాయి.

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

4. ఉపనిషత్తులు: ఇవే పరమాత్మ తత్త్వాన్ని యదార్థంగా తెలియజేసేవి. భగవంతుడు నీవేనని తెలియజేసే జ్ఞాన భాండాగారాలే ఇవి

ఈ చివరిభాగమైన ఉపనిషత్తులనే 'వేదాలకు శిరస్సులు' అంటారు. పరిపక్వసాధకులైన వారికి జీవిత పరమలక్ష్యమైన మోక్షాన్ని పొందాలంటే ఈ ఉపనిషత్తులే కీలకం. ఎన్నో వేల సంవత్సరాల నుండి ఎన్నో ఆటుపోటులకు తట్టుకొని నిలిచిన వేదాంతశాస్త్రాలే ఈ ఉపనిషత్తులు.

ఐతే కాలం గడిచిన కొద్దీ ఈ ఉపనిషత్తులకు అర్థం చెప్పటంలో అభిప్రాయభేదాలు ప్రారంభమైనవి. దానితో ఈ ఉపనిషత్తులను పురస్కరించుకొని వేరువేరు అభిప్రాయలు, వేరువేరు వాదాలు, వేరువేరు మతాలు బయలుదేరాయి. ఎవరికి తోచిన అర్థం, ఎవరికి అనుకూలమైన అర్థాన్ని వారు కల్పించుకున్నారు. ఒకరి అభిప్రాయాలను ఒకరు ఖండించుకుంటూ ఎంతో గందరగోళాన్ని సృష్టించారు. దానితో అసలు విషయం మరుగునపడి మా మతం గొప్పదంటే మా మతం గొప్పదనే సంకుచిత భావాలు బయలుదేరాయి.

ఇలా వచ్చినవే ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం, ద్వైతాద్వైతం, శైవవిశిష్టా ద్వైతం, వీరశైవ విశిష్టాద్వైతం, శుద్ధాద్వైతం - మొదలైన సిద్ధాంతాలు.

ఈ సిద్ధాంతాలను ఆధారం చేసుకొని అనుకూల ప్రతికూల వాదులు ఎందరో బయలుదేరి విషయాన్ని ఇంకా

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

సంక్లిష్టం చేస్తున్నారు. వీరే దేహాత్మ వాదులు, ఇంద్రియాత్మ వాదులు, మనోత్మవాదులు, బుద్ధ్యాత్మవాదులు, చార్వాకులు, నాస్తికులు, బౌద్ధులు, శూన్యవాదులు, వైశేషికులు, సాంఖ్యులు, యోగులు, యోగాచారులు - మొదలైనవారు.

వీరంతా కలసి ప్రజలలో అనైక్యతను పెంచేశారు. ఒకరిని చూస్తే ఒకరికి ద్వేషం కలిగే స్థితిని కల్పించారు. పరమార్థం ప్రక్కకు నెట్టబడింది, పాండిత్యం ముందుకొచ్చింది. వితండవాదాలు బయలుదేరాయి. ఫలితంగా సామాన్య మానవునికి ఈ ఉపనిషత్తులు మార్గం చూపలేని పరిస్థితి దాపురించింది. ఇందువల్ల మానవ జాతికి గొప్ప నష్టం వాటిల్లుతున్నది.

అంతేకాదు ఈ ఉపనిషత్తులు అనేకం ఉన్నాయి. నాలుగు వేదాలలోను కలిపి *1180* ఉపనిషత్తులున్నాయి.

ఋగ్వేదంలో *21* శాఖలున్నాయి.

యజుర్వేదంలో *109* శాఖలున్నాయి.

సామవేదంలో *1000* శాఖలున్నాయి.

అధర్వణ వేదంలో *50* శాఖలున్నాయి.

మొత్తం *1180* శాఖలు - *1180* ఉపనిషత్తులు.

వీటిలో కొన్ని ద్వైత ఉపనిషత్తులుగా, కొన్ని అద్వైత ఉపనిషత్తులుగా కనిపిస్తాయి. కొన్ని శైవ సంబంధ ఉపనిషత్తులుగా, కొన్ని వైష్ణవ సంబంధ ఉపనిషత్తులుగా

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

కనిపిస్తాయి. ఇక ఒక ఉపనిషత్తులో చెప్పిన విషయానికి విరుద్ధంగా మరొక ఉపనిషత్తులో చెప్పినట్లు కనిపిస్తుంది.

వీటిని సమన్వయం చేయలేక, చేయక ఎవరికి అనుకూలమైన అర్థాన్ని - భావాన్ని వారు తీసుకొని వ్యాఖ్యానించటం జరిగింది. దానివల్ల మరింత గజిబిజి ఏర్పడింది. సామాన్య మానవులు ఈ ఉపనిషత్తులన్నింటిని చదివి, అర్థం చేసుకొని, సమన్వయం చేసుకొని ఒక అవగాహనకు రావాలంటే ఒక జీవితకాలంలో సాధ్యమయ్యే విషయం కాదు.

ఇలాంటి పరిస్థితులలో ద్వాపరయుగం చివరిలో దయామయులైన బాదరాయణ మహర్షి (వ్యాసమహర్షి) ఈ ఉపనిషత్తుల అర్థాన్ని సరైన పద్ధతిలో గ్రహించేటట్లు చేయటానికి మోక్షాన్నివ్వగల జ్ఞానాన్ని, వేదాలను, ఉపనిషత్తులను పరిశోధించి, ఈ ఉపనిషత్ మంత్రాలను సమన్వయం చేస్తూ సూత్ర రూపంగా ఈ బ్రహ్మసూత్ర రచన చేయటం జరిగింది. దీనితో వైరుధ్యం తొలగిపోయి ఏకాభిప్రాయం కలుగుతుందని ఆ మహర్షి భావించాడు.

అయితే ఈ సూత్రాలపై కూడా వేరువేరు భాష్యాలు వచ్చాయి. బ్రహ్మ సూత్రాలను ఎవరూ స్వయంగా అర్థం చేసుకోలేరు. అందువల్ల భాష్య రచనలు జరిగినవి. ఇప్పటికీ అనేక మంది భాష్యకారులు బ్రహ్మసూత్రాలకు భాష్యాన్ని వ్రాస్తూనే ఉన్నారు. శంకరాచార్యుల వారికి ముందే కొన్ని





Sample : WWW.SRICHALAPATHIRAO.COM

భాష్యాలు వచ్చాయి. శంకరాచార్యుల భాష్యం వచ్చిన తరువాత దాదాపు *10- 12* భాష్యాలు వచ్చాయి. అయితే అన్నింటిని పరిశోధించిన మహాత్ములు శంకరభాష్యమే బ్రహ్మసూత్రాలకు అనుగుణంగా ఉన్నదని తేల్చారు. శంకరభాష్యం బ్రహ్మసూత్రాలకు పరమ తాత్పర్యం అని నిగ్గు తేల్చారు.

శంకరాచార్యుల వారికి పరమ గురువైన గౌడ పాదాచార్యులు తన మాండూక్య కారికలలో అద్వైతానికి పునాది వేయటం జరిగింది. ఆ పునాది మీదనే శంకరుల అద్వైత భాష్యమనే భవనం నిలిచి ఉన్నది . దీనిని బట్టి శంకరులకు పూర్వమే అద్వైతం వ్యాప్తిలో ఉన్నది. కనుక అద్వైతానికి ఆద్యులు శంకరాచార్యుల వారు కాదు. ఆయన అద్వైతాన్ని వ్యాప్తి చేసిన మహానుభావులు మాత్రమే.

మన మహర్షులు చేసిన కృషికి, వారి మేధా శక్తికి, వారి పరిశీలనా శక్తికి పాశ్చాత్యులు ఆశ్చర్యపోతున్నారు. వేదం చెప్పిన మార్గాన్ని అనుసరిస్తూ షడ్దర్శనాలు వచ్చాయి. ఇవి విచారణలో కొంతమేరకు ఉపకరిస్తాయి. అసలు వేదాంత చర్చ అంతా షడ్దర్శనాలలోనే ఉన్నది.

షడ్దర్శనాలు:

*1.* వైశేషిక దర్శనం - కర్త కణాదమహర్షి.
*2.* న్యాయ దర్శనం - కర్త గౌతమమహర్షి.
*3.* సాంఖ్య దర్శనం - కర్త కపిలమహర్షి.
*4.* యోగ దర్శనం - కర్త పతంజలి మహర్షి.

(కర్మకాండ)

5. పూర్వమీమాంస - కర్త జైమిని మహర్షి.

6. ఉత్తరమీమాంస (బ్రహ్మ సూత్రములు) - కర్త వేదవ్యాస మహర్షి (జ్ఞానకాండ)

పైన పేర్కొన్న 5 దర్శనాలు ఆగినచోట నుండి ఉత్తర మీమాంస ప్రారంభమైంది. అంటే 5 దర్శనాలను పరిశీలించి, విశ్లేషించి, గ్రహించి వేదవ్యాసుడు ఉత్తర మీమాంస సూత్రరచన చేయటం జరిగింది. దీని పరమగమ్యం పరబ్రహ్మమే - జీవన్ముక్తియే - మోక్షమే.

వేదాంత శ్రవణం - పాపహరణం అన్నారు. ఎందుకు? నీవు బ్రహ్మనివి అనే మాటను పదేపదే వినటం వల్ల నీలో ఆ బ్రహ్మభావన స్థిరపడుతుంది. కనుక వినాలి. ఏకాగ్రచిత్తంతో, భక్తితో, శ్రద్ధతో - శ్రవణం చేయాలి.

బ్రహ్మసూత్రములు అంటే? బ్రహ్మమును గూర్చి సూత్ర రూపంలో వివరిస్తున్నది కనుక ఈ గ్రంధమును బ్రహ్మ సూత్రములు అన్నారు.

ఏమిటవి? బ్రహ్మతత్త్వాన్ని వివరించేవే ఈ బ్రహ్మ సూత్రములు.

వివిధ నామములేవి? 1. ఉత్తర మీమాంస. 2. వేదాంత మీమాంస. 3. వేదాంత సూత్రములు.

ఎందుకు చెప్పారు? మానవుడికి ఎల్లప్పుడూ ఆనందం కావాలి. ఇష్టమైన దానిని పొందితే ఆనందం. ఇష్టం లేని వాటిని తొలగించుకుంటే ఆనందం. సుఖాలను పొందితే ఆనందం. కష్టాలను, దుఃఖాలను తొలగించుకుంటే ఆనందం. (i)

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

ఆనందం కోసం కొందరు మణులను, రత్నాలను ఆశ్రయిస్తారు. ఫలానా జాతిరాయిని ధరిస్తే, ఫలానా రుద్రాక్షను ధరిస్తే, నవరత్నాలు పొదిగిన ఉంగరం ధరిస్తే మంచి ఫలితం, సిరిసంపదలు, ఆనందం అని చెప్పగా వాటిని సంపాదించుకుంటారు కొందరు.

*(ii)* ఆనందం కోసం కొందరు మంత్రాలను ఆశ్రయిస్తారు. ఫలానా మంత్రం వలన కార్యసిద్ధి కలుగుతుందని, ఆనందం కలుగుతుందని చెపితే ఆ మంత్రాన్ని ఉపదేశం పొంది జపసాధన సాగిస్తారు.

*(iii)* మరి కొందరు ఆనందం కోసం ఓషధులను ఆశ్రయిస్తారు. ఫలానా ఓషధిని సంపాదిస్తే - ఫలానా ఔషధాన్ని సేవిస్తే ఆనందం అనగానే ఆ వైపుకు అడుగులు వేస్తారు.

*(iv)* మరి కొందరు ఆనందం కొరకు నోములు, వ్రతాలు, పూజలు మొ||న వైదిక కర్మలను ఆశ్రయిస్తారు. భక్తితో వాటిని ఆచరిస్తారు.

*(v)* మరికొందరు పురాణాలను, ఇతిహాసాలను శ్రవణం చేస్తారు. కొందరు సాధనలు చేస్తారు. కొందరు కర్మలు చేస్తారు. అయితే ఈ విధమైన కర్మల వల్ల తాత్కాలిక ఆనందం కలగవచ్చు గాని, శాశ్వతమైన - అఖండమైన - అనంతమైన ఆనందం కలగదు. పైగా ఈ కర్మల వల్ల కర్మఫలాలు వస్తాయి. వాటిని అనుభవించటానికి జన్మలు వస్తాయి. మళ్ళీ ఆ జన్మలలో చేసిన కర్మల వల్ల లభించే కర్మఫలాలు అనుభవించటానికి

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

మళ్ళీ మళ్ళీ జన్మలు కలుగుతూనే ఉంటాయి. ఇలా మానవుడు జనన - మరణ చక్రంలో బంధించబడతాడు.

"ప్రవహించే నదిలోని ఒక సుడిగుండం నుండి తప్పించుకొనుటకు మరొక సుడిగుండంలో చిక్కుకొనే కీటకం లాగా" మానవుడు కర్మబంధంలో చిక్కుకొని దారి తెన్ను గానక అలమటించి పోతున్నాడు. ఇలా కర్మబంధంలో చిక్కుకొని బయటపడలేక - బయటపడాలనే తపనతో తపించే మానవునికి తరుణోపాయం ఒక్కటే. అదే బ్రహ్మజ్ఞానాన్ని పొంది, ఆ బ్రహ్మమును నేనే- 'బ్రహ్మైవాహం' అనే అనుభూతిని పొందటం మాత్రమే. తన యదార్థ స్వరూపమైన 'ఆత్మను - బ్రహ్మన్ని' మరచి దేహ మనోబుద్ధుల తాదాత్మ్యంతో 'జీవుణ్ణి' అనే భ్రమలో ఉండి, సుఖదుఃఖాలననుభవిస్తూ, జననమరణ చక్రంలో బంధించబడ్డ మానవుడు తిరిగి తన స్వరూపమైన 'బ్రహ్మముగా' అనుభూతి చెంది, బ్రహ్మముగా - సచ్చిదానంద స్వరూపముగా ఉండిపోవటమే 'మోక్షం'. అదే శాశ్వత - అఖండ - అనంత ఆనందం.

అట్టి మోక్షాన్ని - శాశ్వత ఆనందాన్ని ఇవ్వగలిగిన 'జ్ఞానం' ఏదిగలదో, అట్టి జ్ఞానాన్ని – ఉపనిషత్తులను, వేదాలను పరిశీలించి, పరిశోధించి భగవత్స్వరూపులైన బాదరాయణులు (వేదవ్యాసుల వారు) సూత్రరూపంగా అందించిన జ్ఞానమే ఈ బ్రహ్మసూత్రములు. బ్రహ్మన్ని తెలియజేసే సూత్రములు గనుక ఇవి

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

బ్రహ్మసూత్రములు అన్నారు. కనుక ఈ బ్రహ్మసూత్రములు ఎందుకు అంటే "మోక్షప్రాప్తి" కొరకే.

బ్రహ్మసూత్రముల రచయిత ఎవరు?

బ్రహ్మసూత్ర రచయిత భగవాన్ బాదరాయణులు, సామాన్య మానవులకు ఉపనిషత్తులనన్నింటిని అధ్యయనం చేసి (శ్రవణం చేసిగాని, చదివిగాని) సమన్వయ పరచుకొని, ఒక అవగాహనకు రావటం అసాధ్యం గనుక దయామయుడైన బాదరాయణ మహర్షి మొత్తం శ్రమనంతటిని తానే ఓర్చుకొని మనకు అనుగ్రహించిన ఉపనిషత్ సారమే ఈ 'బ్రహ్మసూత్రములు'.

బాదరాయణులే వ్యాసమహర్షియా? ఆయన వేరు, ఈయన వేరా? అనే విషయంలో అనేక వాదోపవాదాలున్నాయి. పండితులు ఈ విషయాన్ని పరిశోధిస్తూ, చర్చిస్తూనే ఉన్నారు. ఇక ముందు కూడా ఇలా చర్చిస్తూనే ఉంటారు, వాదోపవాదాలు, ఖండన మండనలు సాగుతూనే ఉంటాయి. ఈ వాదోపవాదాలను, చర్చలను వారికే వదిలేద్దాం. ఏది ఏమైనా వ్యాసమహర్షి తరువాతి వారే బాదరాయణులు అని కొందరు చెబుతుంటారు. మనకు మాత్రం ఎవరైనా ఒకటే. కాకపోతే బాదరాయణులు వేరు అనే అభిప్రాయాన్ని స్వీకరించినా, వ్యాసమహర్షి ఆ బాదరాయణులను పూని ఉండి

Sample.WWW.SRICHALAPA...

ఈ బ్రహ్మసూత్ర రచన సాగించటం జరిగింది అని సరిపెట్టుకుందాం. లేదా వ్యాసుని యొక్క మరియొక పేరే బాదరాయణుడు అనుకుందాం. అలా బాదరాయణ వ్యాసులు - అందాం. ఐతే - బ్రహ్మసూత్ర రచయిత వేదవ్యాసుడే అనేది అత్యధికుల అభిప్రాయం. అదే మనకూ అంగీకారయోగ్యం. అలా అంగీకరించినందున మనకు నష్టం ఏమీలేదు. ఇంతటి మహత్తర గ్రంథం రచించటం - తపోనిధి, ఆగత అనాగత జ్ఞాననిధి, విష్ణురూపుడు, అష్టాదశ పురాణ గ్రంథకర్త, లక్ష శ్లోకాల మహాభారత గ్రంథకర్త, అకళంక చరితుడు, విశాల బుద్ధి, బ్రహ్మనిధి, వేదవేత్త, వేదాలను విభాగించగల పరమజ్ఞాన స్వరూపుడు అయిన వేదవ్యాసునికి తప్ప అన్యునకు సాధ్యమా? అని మనకు అనిపించక మానదు. కనుక బాదరాయణ వ్యాసులు ఒక్కరే అందాం.

## ప్రస్థానత్రయం

ప్రస్థానత్రయం లోనిది బ్రహ్మసూత్రములు, బ్రహ్మసూత్రములు ప్రస్థానత్రయంలో ఒకటి. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత - ఈ మూడింటిని ప్రస్థానత్రయం అంటారు.

ప్రస్థానం అంటే మార్గం అని అర్థం. పదిమంది నడిచే మార్గం ప్రస్థానం. మార్గం ఉంటే గమ్యాన్ని చేరవచ్చు.

Sample : W

మానవులందరి పరమగమ్యం - లక్ష్యం మోక్షమే. గమ్యం ఒక్కటే. కానీ ప్రస్థానాలు మాత్రం 3. నిజంగా ప్రస్థానాలు కూడా మూడు కాదు. ఒక్కటే. అదే జ్ఞానం. జ్ఞానమార్గం. మూడు గ్రంధాలను చెప్పారు గనుక త్రయం - మూడు అన్నారే గాని మూడు గ్రంధాలు చెప్పినది జ్ఞానాన్నే - ఆత్మజ్ఞానాన్నే - బ్రహ్మజ్ఞానాన్నే.

ఈ జ్ఞాన మార్గంలో - ఈ ప్రస్థానంలో - ఈ ప్రయాణంలో *3* గ్రంధాలు *3* మజిలీలు అంటే సరిపోతుంది.

*(1)* ప్రస్థానత్రయంలో మొదటి ప్రస్థానం - 'ఉపనిషత్తులు'. దీనినే 'శ్రుతి ప్రస్థానం' అన్నారు. అంటే శ్రవణం చేయవలసినది అని అర్థం. ఉపనిషత్తులను 'శ్రవణం' చేయాలి.

*(2)* ప్రస్థానత్రయంలో రెండవ ప్రస్థానం - 'బ్రహ్మసూత్రాలు' దీనినే 'తర్క ప్రస్థానం' అన్నారు. అంటే మననం చేయవలసినది. ఈ బ్రహ్మసూత్రాలను 'మననం' చేయాలి. తర్కించాలి. విచారణ చేయాలి. స్థిర భావనకు రావాలి.

*(3)* ప్రస్థానత్రయంలో మూడవ ప్రస్థానం - 'భగవద్గీత' దీనినే 'స్మృతిప్రస్థానం' అన్నారు. స్మృతులు అంటే ధర్మ శాస్త్రాలు, ఇతిహాసాలు, పురాణాలు, షట్ శాస్త్రాలు, వేదాంగాలు మొ//నవి. వీటిలో నున్న విషయాలనన్నింటిని స్మృతికి తెచ్చుకొని చెప్పినది భగవద్గీత గనుక దీనిని స్మృతి ప్రస్థానం అన్నారు. స్మృతి ప్రస్థానం అన్నారు గనుక ఈ భగవద్గీతలోని విషయాలను మరల మరల స్మృతికి తెచ్చుకొని, మరొక ఆలోచన మనస్సులోనికి

Sample : WWW.SRICHALAPATHIRAO.COM



care@srichalapathirao.com +91 8008539770/9538858115

రానీయకుండా నిరంతరము ఆత్మచింతన యందు ఉండాలి. దీనినే నిధిధ్యాసనము అన్నారు. అంటే ఉపనిషత్తులను గురుముఖత 'శ్రవణం' చెయ్యాలి. బ్రహ్మసూత్రాలను విన్న దానిని మరల మరల చింతన చెయ్యాలి. అంటే మననం చెయ్యాలి. భగవద్గీతను అన్యమైన ఆలోచన రాకుండా నిధిధ్యాసన చెయ్యాలి అని పెద్దలు చెబుతారు. ఇంకా చెప్పాలంటే ఉపనిషత్తులను తెలుసుకుంటే శ్రవణం చేసినట్లు, బ్రహ్మసూత్రాలను తెలుసుకోవటం మననం. భగవద్గీతను తెలుసుకోవటం నిధిధ్యాసనం- ఆచరణ అవుతుంది. కనుక ఈ ప్రస్థాన త్రయాన్ని తెలుసుకుంటే శ్రవణ మనన నిధిధ్యాసనలు చేసినట్లే అవుతుంది. ఉపనిషత్తులలోని మంత్రాలను మననం చేస్తూ బ్రహ్మసూత్రాలను చెప్పటం జరిగింది. అంటే - "ఉపనిషత్తులను నెత్తి కెత్తుకొని, మన తలలోకి ఎక్కించటానికి వేదవ్యాసుడు బ్రహ్మసూత్రాల ద్వారా ప్రయత్నం చేశాడు" - అని. అంటే - ఉపనిషత్తుల మననమే బ్రహ్మసూత్రాలు.

ఈ ప్రస్థానత్రయాన్ని నిరంతరం చింతన చేయటం వల్లనే మనకు మోక్షం లభిస్తుంది అనేది పెద్దల అభిప్రాయం. మన మహాప్రస్థానం ముగిసేలోగా ప్రస్థాన త్రయాన్ని అధ్యయనం చేసి, అవగాహన చేసుకొని, అనుభూతిని పొందగలిగితే మానవ జన్మ సార్థకం. జన్మ ధన్యమైనట్లే. ఈ ప్రస్థాన త్రయంలోని ఉపనిషత్తులు పరిపక్వసాధకుల కొరకని, బ్రహ్మసూత్రాలు జిజ్ఞాసాపరులకని, భగవద్గీత సామాన్యుల





Sample: WWW.SRICHALAPATHIRAO.COM

కొరకు - గృహస్థుల కొరకు అని చెబుతారు. వీటిలో బ్రహ్మసూత్రములు చాలా క్లిష్టమైన గ్రంధం గనుక జన సామాన్యంలో లేదు. (మన అదృష్టం ఏమంటే అతి ముఖ్యమైన మాండూక్యోపనిషత్తుతో సహా 7 ఉపనిషత్తులను వివరంగా - సంపూర్ణంగా తెలుసుకున్నాం. భగవద్గీతను ఎంతో వివరంగా - విశ్లేషణాత్మకంగా - ఉపమాన సహితంగా, ప్రతి శ్లోకార్థాన్ని బుద్ధికి అందించాం. ఇప్పుడు బ్రహ్మసూత్రాలను కూడా తెలుసుకోబోతున్నాం. దీనితో ప్రస్థానత్రయాన్ని అధ్యయనం చేసినట్లే)

**సూత్రములంటే ఏమిటి?**

శ్లో|| అల్పాక్షర మసందిగ్ధం, సారవద్విశ్వతో ముఖం|
అస్తోభమనవద్యంచ, సూత్రం సూత్ర విదో విదుః||

1. అల్పాక్షరం: తక్కువ అక్షరాలు కలిగి ఉన్నది,
2. అసందిగ్ధం: సందేహాలకు తావు లేకుండా ఉండేది,
3. సారవత్: సర్వ శాస్త్రముల సారంగా ఉండేది,
4. విశ్వతోముఖం: జ్ఞానానికి అవసరమైన అన్నింటిని (బహుముఖంగా) చెప్పేది,
5. అస్తోభం: పొల్లు మాటలు, అనవసరమైన మాటలు లేనిది,
6. అనవద్యంచ: ఏ విధమైన దోషాలు లేనిది - అంటే మరొకరు ఎవరూ తప్పు పట్టటానికి వీలులేకుండా ఉండేది.

ఈ 6 లక్షణాలు ఉన్న వాక్యాలను సూత్రం అంటారు. ఇలాంటి సూత్రాలతో కూడియున్నది గనుకనే వీటిని

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

బ్రహ్మసూత్రములు అన్నారు. ఇంకా వేరే వేరే పేర్లు కూడా ఉన్నాయి.

ఈ గ్రంధం ప్రధానంగా బ్రహ్మమును గురించిన చింతనను తెలుపుతున్నది గనుక 'బ్రహ్మ సూత్రములు' అన్నారు. వేదాంత విషయాలకు సంబంధించినది గనుక 'వేదాంత సూత్రములు' అన్నారు. ఆత్మకు ఉపాధి శరీరమే గనుక ఆత్మజ్ఞానాన్ని తెలియజేసే సూత్రాలను ' శారీరక సూత్రములు' అని కొందరు అంటున్నారు. ఈ చింతన పూర్వమీమాంసకు చెందినది కాదు గనుక, దాని తరువాతది గనుక 'ఉత్తర మీమాంస సూత్రములు' అన్నారు. ఈ చింతన సన్యాసాశ్రమమునకు చెందిన వారి నుద్దేశించి వ్రాసినది అనే భావనతో దీనిని 'భిక్షుసూత్రములు' అన్నారు.

ఎవరు ఏ విధంగా అన్నప్పటికీ, భావించినప్పటికీ పరబ్రహ్మ స్వరూప స్వభావాలను వివరించిన సూత్రములే ఈ బ్రహ్మ సూత్రములనుట యందు భిన్నాభిప్రాయములు లేవు. ఇవి సూత్రరూపంలో ఉన్నాయి గనుక వ్యాఖ్యానములు, భాష్యములు అవసరమైనవి.

భాష్యములు - వ్యాఖ్యానములు.

బ్రహ్మసూత్రాలకు అనేక భాష్యాలు వెలువడ్డాయి. త్రిమతాచార్యులైన శ్రీ శంకరాచార్యులు, శ్రీ రామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు - ముగ్గురూ భాష్యాలు వ్రాశారు.



Sample : WWW.SRICHALAPATHIRAO.COM

ముందుగా శంకరభగవత్పాదులవారు 'అద్వైత' పరంగా భాష్యం వ్రాశారు. అప్పటికి ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత అనే సిద్ధాంతాలే లేవు. అప్పుడున్నది అభేద వాదం, భేదా భేద వాదం, భేదవాదం అనే వాదాలు మాత్రమే. ఆ తరువాత దాదాపు మూడువందల సంవత్సరాలకు శ్రీ రామానుజాచార్యుల వారు 'విశిష్టా ద్వైత' పరంగా బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాశారు. ఆ తరువాత 400 సంవత్సరాలకు 'ద్వైత' పరంగా శ్రీ మధ్వాచార్యుల వారు భాష్యం వ్రాశారు. ఇలా ముగ్గురు ఆచార్యులు బ్రహ్మసూత్రాలకు తమ తమ సిద్ధాంతాల (మతముల) పరంగా భాష్యాలందించారు.

శంకరాచార్యులవారికి ముందుకూడా బ్రహ్మసూత్రాలకు భాష్యాలు వ్రాసిన వారున్నారు. దాదాపు 10 భాష్యాలున్నాయి. అయితే వాటికి అంతగా ప్రాధాన్యత లేకుండా పోయింది. శంకరుల వారి భాష్యం వచ్చేటప్పటికి అవి అసలు అదృశ్యమై పోయాయి. అవి సర్వాంగీకారంగా లేకపోవటం వల్లను, సూత్రాలకు భాష్యాలను అంత తృప్తికరంగా అందించలేకపోవటం వల్లను అవి కనుమరుగైపోయినవి. ఇప్పుడివి ఎంత వెతికినా కనిపించే స్థితిలో లేవు.

ఇక శంకరుల తరువాత కాలంలో కూడా దాదాపు 10 భాష్యాలు వచ్చాయి. అవి కూడా భేదవాదం, భేదాభేదవాదం, అభేదవాదం మొ||న అనేక వాదాలను ఆధారం చేసుకొనే

SRICHALAPATHIRAO.COM

వచ్చాయి. అవి కూడా అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. కారణం సూత్రాలకు అవి తాత్పర్యంగా, సర్వాంగీకారంగా లేకపోవుటే. వీటిలో కొన్ని భాష్యాలు మాత్రం ప్రచారంలోకి వచ్చాయి. మొత్తం భాష్యాలు: ( మనకు అందినంతవరకు)

1. అద్వైతపరంగా శంకరాచార్యుల వారి 'శారీరక మీమాంస' (భాష్యం)

2. విశిష్టా ద్వైత పరంగా రామానుజాచార్యుల వారి శ్రీ భాష్యం

3. ద్వైత పరంగా మధ్వాచార్యుల వారి 'పూర్ణ ప్రజ్ఞ భాష్యం'

4. ద్వైతాద్వైత పరంగా నింబార్కుల వారి భాష్యం.

5. శైవ విశిష్టా ద్వైత పరంగా శ్రీ కంఠుల భాష్యం- 'శైవ భాష్యం' .

6. శ్రీ పతి వారి 'శ్రీకర భాష్యం' వీరశైవ విశిష్టా ద్వైతం.

7. విజ్ఞాన భిక్షు భాష్యం. 'విజ్ఞానామృతం' (అవిభాగా ద్వైతం)

8. భాస్కరాచార్యుల వారి భాస్కర భాష్యం. భేదాభేదం.

9. వల్లభాచార్యుల అణు భాష్యం. శుద్ధా ద్వైతం.

10. బలదేవాచార్యుల వారి గోవిందభాష్యం- అచింత్య భేదాభేదం.

ఇలా అనేక భాష్యాలు వెలువడ్డాయి. అయితే అన్నింటిని పరిశోధించిన మహాత్ములు శంకర భాష్యమే సూత్రాలకు అనుగుణంగా ఉన్నదని తేల్చారు.

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

శంకరభాష్యం బ్రహ్మసూత్రాలకు పరమతాత్పర్యం అని పండితులు, మహాత్ములు నిగ్గు తేల్చారు. ఇతర భాష్యాలన్నీ 'శిశువులు' అన్నారు.

ఇక శంకరాచార్యులవారి భాష్యాన్ని మరింతగా వివరిస్తూ, ఆయన శిష్యులు, ఇతరులు అనేక భాష్యాలను వ్రాశారు. వాటి వల్లనే సామాన్యులలోకి బ్రహ్మసూత్రాలు వ్యాప్తి చెందినవని చెప్పవచ్చు. అలా వెలువడిన భాష్యాలలో ప్రప్రథమంగా పేర్కొన దగినవి -

*(1)* శంకరుని ప్రియశిష్యులు పద్మ పాదాచార్యుల వారు. 'పంచపాదిక' అను పేర శంకరులను అనుకరిస్తూ అద్భుత గ్రంధాన్ని వ్రాశారు. ఆయన కేవలం *4* సూత్రాలపై మాత్రమే ఎంతో వివరణాత్మక వ్యాఖ్యానం వ్రాశారు.

దీనినే 'చతుస్సూత్రీ' అని కూడా అంటారు. ఈ నాలుగు సూత్రాలపై *4* వాల్యూమ్స్ గ్రంధం ఉన్నది. కేవలం నాలుగు సూత్రాలను తెలుసుకుంటే ఏం ప్రయోజనం? అనే సందేహం కలగవచ్చు. అయితే ఈ *4* సూత్రాలను తెలుసుకుంటే *555* సూత్రాలను తెలుసుకున్నట్లే అని ఈ గ్రంధాన్ని అధ్యయనం చేసిన వారు చెబుతుంటారు. ఏమైనా ఇది గొప్ప భాష్యం అనక తప్పదు.

*(2)* శంకరాచార్యుల వారి మరొక శిష్యులు, మహా మేధావి సురేశ్వరాచార్యుల వారు కూడా బ్రహ్మసూత్రాలపై భాష్యం

WWW.SRICHALAPATHIRAO.COM

వ్రాశారు. అయితే శంకరుల వారు "నీ భాష్యం ప్రచారంలోకి రాదు. కానీ నీవు మరొక జన్మ ఎత్తి అప్పుడు భాష్యం వ్రాస్తావు. అది బహుళ ప్రచారంలోకి వస్తుంది" అన్నాడు. అన్నట్లే సురేశ్వరాచార్యుల గ్రంధం వ్యాప్తిలోనికి రాలేదు. క్రీ||శ|| 840 ప్రాంతంలో సురేశ్వరాచార్యులే వాచస్పతి మిశ్రునిగా జన్మించి మొత్తం 555 సూత్రాలకు భాష్యం వ్రాశారు. అదే భామతీ వ్యాఖ్య. అది బహుళ ప్రచారంలోకి రావటమే గాక దానిని అనుసరిస్తూ అనుకరిస్తూ మరికొన్ని భాష్యాలు కూడా వచ్చాయి.

*(3) 840 లో వాచస్పతి మిశ్రా 'భామతీ' వ్యాఖ్య*

*(4) దానిని అనుసరించి 13వ శతాబ్దంలో అమలానందులు 'కల్పతరువు' అనే పేరుతో వ్యాఖ్య వ్రాయగా*

*(5) ఆ 'కల్పతరువు' కు 16వ శతాబ్దంలో అప్పయ్య దీక్షితులు 'పరిమళ' అనే వ్యాఖ్యానం వ్రాశారు.*

అంటే - శంకర భాష్యానికి వాచస్పతి మిశ్రా 'భామతి' ని చెప్పగా, 'భామతి' ని అమలానందులు 'కల్పతరువు' ను చేశారు. ఆ కల్పతరువుకు 'పరిమళ' మును అద్ది అప్పయ్య దీక్షితులు దశదిశల వ్యాపింపజేశారు. అప్పయ్య దీక్షితులను కంచి పీఠాధిపతి రెండవ శంకరులు అని ప్రశంసించారు.

*(6) ఇక పద్మ పాదాచార్యుల వారి 'పంచ పాదిక' ను అనుసరిస్తూ వివరణాచార్యుల వారు 'తత్త్వ దీపన' అనే వ్యాఖ్యనందించారు.*

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

(7) రామానందుల వారు 'రత్నప్రభ' పేరుతో వ్యాఖ్యానం వ్రాశారు.

ఇలా ఎందరో మహానుభావులు శంకరుల భాష్యాన్ని అనుసరించి అనేక వ్యాఖ్యానాలను వెలువరించారు.

ఈ భాష్యాలు, వ్యాఖ్యానాలు అన్నీ సంస్కృతంలో ఉండటం వల్ల చాలా కాలం పాటు ఆంధ్రపాఠకులకు అవి దూరంగానే ఉన్నాయి. ఈ పరిస్థితిని గుర్తించిన, అనుభవించిన మహాత్ములు, పండితులు, వేదవేత్తలు ఎందరో ఈ బ్రహ్మసూత్రాలకు తెలుగులో ప్రతిపదార్థ, తాత్పర్య, విశేషార్థాలతో వ్యాఖ్యాన సహితంగా అనేక గ్రంధాలు వెలువరించటంతో కంఠంలోతు నీటిలో ప్రయాణించవలసిన మనలను నడుములోతు వరకు తీసుకొచ్చారు. వాటికి ప్రవచనాలు ఇస్తూ మరి కొందరు మహాత్ములు మోకాటి లోతు వరకు తీసుకొని వచ్చారు. ఇక ప్రయాణం సాఫీగా సాగించటం ఆధ్యాత్మిక జ్ఞాన పిపాసుల యొక్క, సాధకుల యొక్క కర్తవ్యం అని వేరే చెప్పనక్కరలేదు.

బ్రహ్మసూత్ర గ్రంధం గురించి:

(1) బ్రహ్మసూత్రములు సూత్రరూపంలో ఉండటం వల్లను, విషయం చాలా లోతైనది గనుకను బహు నిగూఢమైనవి. ఇవి సామాన్యులకే గాదు ధీమాన్యులకు (బుద్ధి శాలురకు) కూడా సులభగ్రాహ్యం కాదు. (సులభంగా అర్థం కాదు)





Sample : WWW.SRICHALAPATHIRAO.COM

*(2)* బ్రహ్మసూత్రము మోక్ష ప్రసాదకములు. జిజ్ఞాసతో వీటిని పరిశీలించి, విశ్లేషణ చేసి, అవగాహన చేసుకొని ఆచరణలో పెట్టుకుంటే 'మోక్షప్రాప్తి' తథ్యం.

*(3)* గంభీరమైన అనేక విషయాలను సూత్రీకరించి మహర్షులు వీటిని మనకు గొప్ప సంపదగా అందించారు.

*(4)* ఇక సూత్రరూపంలో ఉన్నది కేవలం బ్రహ్మ సూత్రాలే కాదు,

*(a)* పతంజలి మహర్షి యోగదర్శనం యోగ సూత్రములు గాను,

*(b)* గౌతమ మహర్షి న్యాయ దర్శనం న్యాయ సూత్రములు గాను,

*(c)* కపిల మహర్షి సాంఖ్య దర్శనం సాంఖ్య సూత్రములు గాను,

*(d)* కణాద మహర్షి వైశేషిక దర్శనం సూత్రములు గాను,

*(e)* పాణిని మహర్షి వ్యాకరణం వ్యాకరణ సూత్రములు గాను,

*(f)* జైమిని మహర్షి పూర్వ మీమాంస ధర్మ సూత్రములు గాను,

*(g)* నారద మహర్షి భక్తిని నారద భక్తి సూత్రములు గాను, ఇలా అనేక మంది మహర్షులు తమ తమ గ్రంధాలను సూత్రరూపం గానే అందించటం జరిగింది.

ఇంకా ఆపస్తంభ సూత్రాలని, అశ్వలాయన సూత్రాలని, జైమిని సూత్రాలని, వాత్సాయన కామ సూత్రాలని అనేక గ్రంధాలు సూత్రరూపంలో ఉన్నాయి. ఋగ్వేదంలో వీరి పేర్లు కనిపిస్తాయి.

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

*(5)* వేదసారం ఉపనిషత్తులయితే ఉపనిషత్తుల సారం బ్రహ్మసూత్రములు. అనేక ఉపనిషత్తులలో కనిపించే వైరుధ్యాన్ని సమన్వయం చేసి ఏక వాక్యతకు - ఏకాభిప్రాయానికి తెచ్చేటందుకే ఈ బ్రహ్మసూత్ర రచన సాగింది. బ్రహ్మసూత్రాలు పూర్తిగా ఉపనిషత్తులపై ఆధారపడినవే.

*(6)* బ్రహ్మజ్ఞానం కలగాలంటే - స్థిరపడాలంటే బ్రహ్మ సూత్రాలను అర్థం చేసుకోవాలి.

*(7)* బ్రహ్మసూత్రాలను అర్థం చేసుకోగలిగితే ఆత్మానుసంధానం చేసుకొనే పద్ధతి తెలుస్తుంది. దానితో జీవన్ముక్తి.

*(8)* బ్రహ్మ జ్ఞానాన్ని గురించి అనేక విధాలుగా వివరించి తెలియజేసే గ్రంధమే ఈ బ్రహ్మసూత్రాలు. ఈ సూత్రములు పరిమాణం *(size)* లో చిన్నవి. కానీ విజ్ఞానానికి వచ్చేసరికి సముద్రమంత పెద్దవి. అందుకే ఈ సూత్రములకు భాష్యం అవసరమైంది. ఆ భాష్యాలకు వ్యాఖ్యానం, వ్యాఖ్యానికి ప్రవచనాలు అవసరమైనవి.

*(9)* అహంవేత్తి, శుకం వేత్తి, సంజయో వేత్తి వానవా*!* అని వ్యాసుడు మహాభారతంలో అన్నట్లు ఈ బ్రహ్మ సూత్రాలు - రచించిన వ్యాసుల వారికి, భాష్యం వ్రాసిన శంకర భగవత్పాదులకు, ఇంకా అంతటి వారైన బహు కొద్ది మందికి తప్ప మిగిలిన వారందరికి ఇవి ఇనుపగుగ్గిళ్ళే. అంత తేలికగా మింగుడు పడవు. జిజ్ఞాస, శ్రద్ధ, పట్టుదల, మేధాశక్తి గలవారికి

Sample: WWW.SRICHALAPATHIRAO.COM

కూడా ఈ ప్రయాణంలో నడక అంత సాఫీగా - సజావుగా సాగదు.

ఎందుకంటే ఈ బ్రహ్మసూత్రాలు అత్యంత గహన విషయం. కేవలం జ్ఞాన విషయం. ఇది రంజనకర విషయం కాదు. అంటే వినోదం కోసం చెప్పిన విషయం కాదు. ఆలోచన రేకెత్తించే విషయం. రంజనకర విషయం (వినోదం కలిగించే విషయం) అయితే బుద్ధికి శ్రమ ఉండదు. హాయిగా ఎంతసేపైనా వినవచ్చు. కాని ఇది గహన విషయం - జ్ఞాన విషయం ఆలోచన రేకెత్తించే విషయం గనుక కొద్దిసేపటికే బుద్ధి విశ్రాంతి కోరుతుంది. రంజన దృష్టితో కాకుండా సత్యాన్వేషణ దృష్టితో చెప్పాలన్నా వినాలన్నా గొప్ప ఏకాగ్రత కావాలి. ఇలాంటి విషయాన్ని చెప్పటానికి ప్రయత్నించటమంటే గొప్ప సాహసమే. భగవంతుడే ముందుకు నెడతాడనే విశ్వాసంతో - ఆయనపై భారం వేసి - ఆయన అనుగ్రహాన్ని అర్థిస్తూ ఈ సాహసం చేస్తున్నాను.

**(10) బ్రహ్మసూత్రములనే ఈ గ్రంధం యొక్క అంతిమ ప్రయోజనం ఏమిటి? -**

బ్రహ్మమును గురించి సూత్రరూపంలో తెలియజేసిన ఈ గ్రంధం ఏమి చెబుతున్నది?

జీవుడికి బ్రహ్మనికి భేదం లేదని, ఇద్దరు ఒక్కటే అని; అసలు ఇద్దరు లేరని, సత్యంగా ఉన్న బ్రహ్మమే అజ్ఞానంలో జీవుడిగా తనను తాను భ్రమపడుతున్నాడని, అజ్ఞానం తొలగితే

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

భ్రమ తొలగి; తాను జీవుణ్ణి కాదని, బ్రహ్మమునే అని తెలుస్తుందని; అప్పుడు బ్రహ్మముగానే ఉండిపోవటం జరుగుతుందని; అదే మోక్షం అని చెబుతున్నది. ఇలా ఉన్నది బ్రహ్మమేనని బ్రహ్మము కన్న అన్యంగా జీవుడు - జగత్తు అనేవి లేనేలేవని చెప్పటానికి కావలసిన విచారణ ఈ గ్రంథంలో విపులంగా చేయబడింది. ఉపనిషత్తులన్నీ ఈ జీవ బ్రహ్మైక్యతనే ఘోషిస్తున్నాయి.

ఈ జననమరణరూప సంసారబంధనాల నుండి పూర్తిగ విడుదల చెందటమే; విముక్తి చెందటమే మానవజీవితం యొక్క పరమలక్ష్యమని బోధించటమే ఈ గ్రంథ ఉద్దేశం. అలా విడుదల పొందాలంటే జీవుడు యదార్థంగా బ్రహ్మమే అనే జ్ఞానం కలగాలి. జ్ఞానంతో బాటుగా వైరాగ్యమూ కలగాలి. ఈ జ్ఞానం కలగటానికి అడ్డుగా ఉన్నదే అవిద్య. దీనినే అజ్ఞానం అని, మిథ్యాజ్ఞానం అని, భ్రాంతి అని, అధ్యాస అని అంటారు.

త్రాడును చూచి పాము అని భ్రమ పడతాం. త్రాడు సత్యం, పాము భ్రమ. ఈ భ్రమనే అధ్యాస అన్నారు. అంటే ఒకదానిని చూచి దానిని మరొక దానిగా భావించటమే అధ్యాస.

పరమాత్మను ప్రపంచంగా, ఆత్మను జీవుడిగా భ్రమ పడుతున్నాం. ఈ భ్రమ తొలగితేనే ఉన్న దానిని ఉన్నట్లు

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

తెలుసుకోగలుగుతాం. చీకటి తొలగితేనే త్రాడును తెలుసుకున్నట్లు అజ్ఞానం తొలగితేనే బ్రహ్మన్ని తెలుసుకోగలుగుతాం.

ఆత్మనైన నేను - ఆనంద స్వరూపమే అయిన ఆత్మనైన నేను జీవుణ్ణి అని భ్రమపడుతున్నందునే - దేహాన్ని అని భ్రమపడుతుండటం వల్లనే నా భార్య, నా బిడ్డలు, నా యిల్లు, నా డబ్బు అనే భావం కలుగుతున్నది.

ఈ అహంకార మమకారాల (నేను - నాది) వల్లనే దుఃఖాలు. ఈ దుఃఖాలు పోవాలంటే అధ్యాస తొలగాలి. నేను దేహాన్ని అనే దేహతాదాత్మ్యం తొలగాలి. అందుకే విచారణ - ఆత్మవిచారణ. ఈ విచారణ కొరకే బ్రహ్మ సూత్రములు. అలాగే వైరాగ్యం కొరకు జీవుల గతి అగతులను తెలియజేయటం జరిగింది.

<u>గ్రంధపరిమాణం</u>

'బ్రహ్మసూత్రములు' అనే ఈ గ్రంధము నందు 4 అధ్యాయాలు ఉన్నాయి. అవి-

*1.* <u>సమన్వయాధ్యాయం:</u> ఉపనిషత్ వాక్య సమన్వయాన్ని తెలియజేస్తుంది. వాక్యాల మధ్య విరోధాన్ని నిరోధించి సమన్వయం చేస్తుంది.

*2.* <u>అవిరోధాధ్యాయం:-</u> ఇతర అప్రమాణ సిద్ధాంతాలను, అభిప్రాయాలను ఇతర మత సిద్ధాంతాలను ఖండిస్తుంది.

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

3. సాధనాధ్యాయం:- బ్రహ్మన్ని తెలియజేస్తూ ముక్తి సాధనోపాయాన్ని తెలియజేస్తుంది.

4. ఫలాధ్యాయం:- ముక్తి స్వరూప నిర్ణయాన్ని - సాధన ఫలమైన మోక్షాన్ని తెలియజేస్తుంది. ఈ విధంగా గ్రంధం మొత్తం నాలుగు అధ్యాయాలైతే తిరిగి ఒక్కొక్క అధ్యాయంలో 4 పాదాలు చొప్పున 4*4= మొత్తం 16 పాదాలున్నాయి. ఒక్కొక్క పాదంలో కొన్ని అధికరణాలు, ఒక్కొక్క అధికరణంలో కొన్ని సూత్రాలు ఉన్నాయి. మొత్తంగా చూస్తే

1. మొదటి అధ్యాయంలో 4 పాదాలు, 39 అధికరణాలు 134 సూత్రములు.

2. రెండవ అధ్యాయంలో 4 పాదాలు, 47 అధికరణాలు 157 సూత్రములు.

3. మూడవ అధ్యాయంలో 4 పాదాలు, 67 అధికరణాలు 186 సూత్రములు.

4. నాలుగవ అధ్యాయంలో 4 పాదాలు, 38 అధికరణాలు 78 సూత్రములు ఉన్నాయి.

మొత్తం 4 అధ్యాయాలు, 16 పాదాలు, 191 అధికరణాలు, 555 సూత్రాలు.

వేదముల యందు బ్రహ్మమును గురించిన జ్ఞానాన్ని తెలిపే భాగములనే 'ఉపనిషత్తులు' అంటారు. ఈ ఉపనిషత్తులన్నీ కలిపి 'జ్ఞానకాండ' అని అంటారు. బ్రహ్మజ్ఞానమే జ్ఞానకాండ. ఈ బ్రహ్మజ్ఞానాన్ని హేతు పూర్వకంగా పొందలేము.

Sample: WWW.SRICHALAPATHIRAO.COM

'అనుభవపూర్వకంగా' గ్రహించవలసిందే. అందుకే దీనిని 'బ్రహ్మవిద్య' అన్నారు. బ్రహ్మన్ని గురించి చెప్పిన విద్య బ్రహ్మవిద్య.

శంకరులు ఈ బ్రహ్మసూత్ర భాష్యంలో అనేక ఉపనిషత్తుల నుండి ఎన్నో మంత్రాలను ఉదహరించటం జరిగింది. అవి –

కఠ, ప్రశ్న, ముండక, ఐతరేయ, తైత్తిరీయ, ఛాందోగ్య, బృహదారణ్యక, శ్వేతాశ్వతర, జాబాల, కౌషీతకీ మొ//నవి. ఇలా ఎంతో విస్తృతమైన పరిశీలనతో - బ్రహ్మ సూత్రములకు భాష్యం ఇవ్వబడింది.

Sample. WWW.SRICHALAPATHIRAO.COM

త్రిమత సిద్ధాంతములు:

*1) అద్వైతం 2) విశిష్టా ద్వైతం 3) ద్వైతం అని 3 -*

*(1)* అద్వైతం: "ఏకమేవా2ద్వయం బ్రహ్మ నేహనానాఽ స్తి కించన" "ఏకమేవాఽ ద్వితీయం బ్రహ్మ" లాంటి అనేక శ్రుతి వాక్యాల వల్ల ఉన్నదొక్కటే బ్రహ్మమని, బ్రహ్మము తప్ప రెండవదేదీ లేదని, సృష్టికి పూర్వం బ్రహ్మం మాత్రమే ఉన్నదని, ఆ బ్రహ్మము "స ఐక్షత బహుస్యాం ప్రజాయేతి" - "ఒక్కటే అయిన నేను అనేకంగా అగుదును" అని సంకల్పించెను - అని సిద్ధాంతం.

బ్రహ్మము ప్రపంచంగా - జీవుళ్ళుగా పరిణామం చెందలేదు మారిపోలేదు. పాలు పెరుగైనట్లుగా మారలేదు. స్వశక్తియైన మాయచేత ప్రపంచంగా - జీవుళ్ళుగా కనిపిస్తున్నది. చీకటి కారణంగా త్రాడు పాముగా కనిపించినట్లు



care@srichalapathirao.com +91 8008539770/9538858115

- భ్రమగొల్పినట్లు పరమాత్మే ప్రపంచంగా - జీవుళ్ళుగా భ్రమ కలుగుతున్నది. దీనినే వివర్తవాదం అంటారు. కనుక అసలు సత్యం బ్రహ్మం ఒక్కటే - అద్వితీయం - అద్వయం.

జీవులు అజ్ఞానం వల్ల పుట్టిన భ్రాంతిచేత తమ నిజస్వరూపాన్ని గ్రహించలేక తాముపేరని, బ్రహ్మమువేరని, తాము అల్పులమని, బ్రహ్మము అధికుడని భ్రమపడుతున్నారు.

నిజంగా జీవునికి - బ్రహ్మనికి పారమార్థికంగా ఏ భేదమూ లేదు. కనిపించే భేదం అంతా 'బుద్ధి' యనే ఉపాధి వల్లనే. కనుక తత్త్వమసి మొ//న మహావాక్యాల విచారణచే కలిగిన జ్ఞానంతో అవిద్యాభ్రమను - మాయను అతిక్రమించి అఖండ సచ్చిందానంద ఆత్మసాక్షాత్కారంతో స్వస్వరూపాన్ని పొంది 'అహం బ్రహ్మాస్మి' అనే అనుభవజ్ఞానాన్ని పొంది బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి - బ్రహ్మజ్ఞాని బ్రహ్మమే కావాలి.

నదులు ప్రవహించి ప్రవహించి సముద్రాన్ని చేరి నామరూపాలు వదిలి సముద్రమే అయినట్లు జీవుడు ప్రయాణించి ప్రయాణించి ఆ పరమాత్మను చేరి నామరూపాలు వదిలి ఆ పరమపురుషుడే అవుతాడు ఇదే జీవబ్రహ్మైక్యం.

*(2)* <u>విశిష్టా ద్వైతం:</u> జీవులు పరమాత్మలో అంశీభూతులు. పరమాత్మ యొక్క దేహంలో కాళ్ళు, చేతులు, కళ్ళు, ముక్కు, నోరులాగా ఈ జీవుళ్ళంతా పరమాత్మ యొక్క అంగాలు. జీవులతో కూడియున్న పరమాత్మ ఒక్కడే. ఏకమేవాఽద్వితీయం

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

బ్రహ్మ అంటే ఇదే. జీవుళ్ళు - పరమాత్మ కలిసి అంతా ఒక్కటే అని.

పరమాత్మలో జీవాత్మలున్నాయని, జీవాత్మలు స్వతంత్రించటం చేత సుఖదుఃఖాలకు లోనవుతున్నాయని కనుక పరమాత్మ యందు (భక్తి - శరణాగతి) ప్రపత్తి చేత, శుద్ధి చేయబడ్డ బుద్ధి వల్ల, భగవద్దర్శనం చేసి, స్వస్వరూప ఆవిర్భావాన్ని పొంది, వైకుంఠాన్ని చేరి, విష్ణువు పర్యంకమున బ్రహ్మానందాన్ని పొందుతారని ఈ సిద్ధాంతం. (ఈ భక్తితో జ్ఞానమార్గంలో ప్రవేశం)

*(3)* <u>ద్వైత సిద్ధాంతం</u> : జీవుళ్ళు వేరు, పరమాత్మ(భగవంతుడు) వేరు. జీవుళ్ళంతా మహాప్రళయం లో భగవంతుని ఉదరంలో ఉండి తిరిగి సృష్టి జరిగే ప్రారంభంలో కర్మ ప్రేరితులై పుడుతూ ఉంటారు. సంసార బంధంలో చిక్కిన జీవుడు కర్మల చేత ముక్తి కలగదని తెలుసుకొని, బ్రహ్మనిష్ఠుడైన గురువును సమీపించి, యదార్థ జ్ఞానాన్ని పొంది తన హృదయ పద్మము నందు పరమాత్మను 'బింబ' రూపంగా దర్శించి అనిష్ట సంచిత కర్మలనన్నింటిని నాశనం గావించుకుని చివరి దేహం నుండి బయటపడి హిరణ్యగర్భ (బ్రహ్మ) లోకంలో ఉండి బ్రహ్మాండం అంతా లయమైనప్పుడు బ్రహ్మదేవునితో గూడ విరజా నదిలో స్నానం చేసి సూక్ష్మశరీరం నుండి విముక్తి చెంది శ్వేతద్వీప వాసుడైన వాసుదేవమూర్తిని సందర్శించి, భగవంతుని





Sample : WWW.SRICHALAPATHIRAO.COM

సాన్నిధ్యంలో ఉపాసన చేస్తూ ఉంటాడు. వీరు మరల జన్మించరు.

అయితే ముక్తులలో ఉత్తమ - మధ్యమ - అధమ అని భేదాలను అంగీకరిస్తారు. అలాగే వారు పొందే బ్రహ్మానందంలో కూడా భేదాలను అంగీకరిస్తారు.

ముక్తి చెందిన జీవులు శ్రీహరి లోపల, వెలుపల స్వరూప దేహంతో గాని, లీలాగృహీత శుద్ధ సత్వాత్మక దేహంతో గాని సంకల్పమాత్రం చేత సిద్ధించే దివ్యభోగాలను యోగ్యతానుసారంగా అనుభవిస్తూ ఉంటారు.

ఈ *3* మత సిద్ధాంతాలు గాక ఇంకా అనేక సిద్ధాంతాలు బయలు దేరాయి. ఇక ముందు అనేకం వస్తాయి. వీటివల్ల కావలసినంత గందరగోళం ఏర్పడి అసలు విషయం మరుగునపడి పోవటం జరుగుతుంది. మనకు బ్రహ్మవిచారణయే ముఖ్యం. కనుక బ్రహ్మ విచారణ కొరకు బ్రహ్మసూత్రాలను ప్రారంభిద్దాం. తెలుసుకుందాం. బ్రహ్మసూత్ర గ్రంధాన్ని - దానికి శంకరుల శారీరక **మీమాంసా** భాష్యాన్ని ఆధారం చేసుకొని విచారణ సాగిద్దాం.

బ్రహ్మసూత్రాలను అవగాహన చేసుకొనేందుకు శంకరులవారు ముందే మనకు ఎంతో మేలు చేశారు. ఎలా*?* తత్త్వబోధ, వివేక చూడామణి, అపరోక్షానుభూతి, దక్షిణామూర్తి స్తోత్రం, ఆత్మబోధ మొ||న ప్రకరణ గ్రంధాలను ముందుగానే ప్రసాదించి శంకర భగవత్పాదులు, మనను





Sample: WWW.SRICHALAPATHIRAO.COM

ఉపనిషత్తులలోనికి ప్రవేశించేందుకు చక్కగా తయారుచేశారు. ఆ విధంగా బ్రహ్మసూత్రాలను జిజ్ఞాసతో అవగాహన చేసుకొనేందుకు మనకు ఎంత మేలు చేశారో మాటలతో వర్ణించే వీలులేదు. ఇప్పుడు బ్రహ్మ సూత్రాలలోనికి ప్రవేశిస్తున్నాం. ఇలా ప్రవేశించే ముందు శంకరుల భాష్యంలో ఒక అద్భుతమైన ఉపోద్ఘాతాన్ని శంకరులు అందించారు. ఏమిటది?

బ్రహ్మసూత్రాల ప్రయోజనం ఏమిటి?అని ప్రశ్న. ఉపనిషత్ విద్యను మననం చేసుకొనుటకే బ్రహ్మసూత్రాలు అని సమాధానం. అసలు సూత్రం అంటే ఏమిటి? సూత్రం అంటే త్రాడు అని అర్థం. త్రాడు దేనికి?

పువ్వులు గాని, పూసలు గాని గ్రుచ్చుకొని దండ తయారుకే - మరి ఇక్కడ సూత్రంతో ఏం గ్రుచ్చుతున్నారు? వేదాంత వాక్యాలనే వివిధ రంగుల పుష్పాలను గ్రుచ్చుతున్నారు. అసలు వేదాంతం ఏం చెబుతున్నది? ఏం చెబుతున్నదో తెలుసుకోవటానికి *555* సూత్రాలు అవసరం లేదు. ఒక్క మాట తెలుసుకుంటే చాలు. ఏమిటా ఒక్క మాట? అంత గొప్పమాట? ఏమిటి? - "సర్వం బ్రహ్మమయం జగత్" ఈ ఒక్కటి వంటబట్టకనే అనేకం చెప్పాల్సి వచ్చింది. మన యదార్థ స్వరూపం బ్రహ్మం.

కానీ నేను దేహాన్ని అని భ్రమపడుతున్నాను. ఇదే అధ్యాస. అధ్యాస తొలగితే నేను బ్రహ్మన్నే. కాని అంత తేలికగా

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

తొలగదు. కారణం? అనేక జన్మల నుండీ ఉన్నది గనుక అలవాటై పోయింది. ఈ అధ్యాసను తొలగించటమే ప్రధానం. అసలు అధ్యాస అంటే? అది కానీ దాన్ని అది అనుకోవటమే అధ్యాస.

అనాత్మను ఆత్మగా - ఆత్మను అనాత్మగా భావించటం, దేహాన్ని ఆత్మ అని అనుకోవటం. నిజం ఏమిటి? నేను ఆత్మను. దేహాన్ని కాదు. నేను శరీరంలో ఉన్నాను అనుకుంటే తప్పులేదు. కాని శరీరాన్ని గట్టిగా పట్టుకకూర్చున్నాను. ఇదే తప్పు. దేహధర్మాలను నాపై వేసుకొని కూర్చున్నాను. ఇదే తప్పు. దేహ ధర్మాలను నాపై వేసుకొని కూర్చున్నాను. ఇదే అధ్యాస.

*(i)* దేహం నల్లగా ఉంటే నేను నల్లగా ఉన్నాను అంటున్నాను. దేహానికి నొప్పి కలిగితే నాకు నొప్పి అంటున్నాను. దేహమే నేను అనే అధ్యాస.

*(ii)* మనస్సుకు సంతోషంగా ఉన్నప్పుడు నేను సంతోషంగా ఉన్నాను అంటున్నాను. అంటే మనస్సునే నేను అనే అధ్యాస. ఈ అధ్యాస అనేక జన్మల నుంచీ ఉన్నది; స్వాభావికంగా ఉన్నది; అనాది నుండి ఉన్నది. ఈ అధ్యాస పోయేందుకే ఈ బ్రహ్మసూత్రములు. నేను ఆత్మను - పరమాత్మను - బ్రహ్మన్ని అని నిలిపేందుకే - అధ్యాసను పోగొట్టేందుకే శాస్త్రం. అందుకే శాస్త్రం 'అధ్యాసలో ఉన్నవారికే' నని చెప్పటం. అయితే అధ్యాస లేని దెవరికి? వినేవారికి, చెప్పేవారికి, గ్రంధాలు వ్రాసేవారికి అందరికీ ఉన్నది. గొప్పగొప్ప స్వామీజీలు కూడా అధ్యాసలో

Sample : www.sri

ఉన్నవారే. గొప్ప పాండిత్యం ఉన్నవారు కూడ అధ్యాసలో ఉన్నవారే. ఆత్మవిచారణ చేసేటప్పుడు నేను బ్రహ్మన్ని అంటారు. కానీ వ్యవహారంలో దేహం గానే - జీవుడు గానే ఉంటారు.

ఒక స్వామిజీ అరణ్య సమీపంలో ప్రవచనాలు చేస్తున్నాడు. అంతా మిథ్య, ఈ జగమంతా మిథ్య అని చెబుతున్నాడు. ఇంతలో ఒక ఏనుగు వచ్చింది. అందరూ పరుగెత్తారు. స్వామిజీ కూడా పరుగెత్తారు. కొంతసేపటికి అందరూ కూడారు. శిష్యుడన్నాడు, స్వామీ! గజం మిథ్య గదా! మీరెందుకు పారిపోయారు? అని. స్వామిజీ అన్నాడు, నాయనా! గజం మిథ్య, పలాయనం మిథ్య" అని -

Sample : WWW.SRICHALAPATHIRAO.COM



care@srichalapathirao.com +91 8008539770/9538858115

# మొదటి సూత్రం

*బ్రహ్మ సూత్రాలలో మొదటి సూత్రం "అధాతో బ్రహ్మ జిజ్ఞాసా"*

ఇప్పుడు దాని గురించి చూద్దాం.

ఈ సూత్రాన్ని తెలుసుకోకుండా ఎంత తెలుసుకున్నా ప్రయోజనం లేదు.

అధ = అటుపిమ్మట; అతః = అందువల్ల; బ్రహ్మజిజ్ఞాస = బ్రహ్మజిజ్ఞాస. అసంపూర్ణంగా ఉంది గదా!

ఈ *3* పదాల సూత్రానికి మరొక పదం 'కర్తవ్యః' కలపాలి. అప్పుడే సంపూర్ణ భావం. ఏమిటది? అధాతో బ్రహ్మ జిజ్ఞాసా కర్తవ్యః (చెయ్యాలి).

భావం : (సాధనచతుష్టయం సిద్ధించిన) పిమ్మట - తరువాత (కర్మఫలం అనిత్యమైనదని, జ్ఞాన ఫలమైన మోక్షం నిత్యమని తెలిసినది) అందువల్ల - కాబట్టి, మోక్షార్థియైనవాడు బ్రహ్మన్ని తెలుసుకోవాలనే కోరికతో ఉంటాడు – ఉండాలి.

వ్యాఖ్య : ఈ సూత్రంలో అధ - అతః బ్రహ్మ జిజ్ఞాస అనే *3* పదాలున్నాయి. ముందు ఈ పదాలను విశ్లేషణ చేద్దాం.

*I.* అధ :- అధ అనేది మంగళవాచకం. ఏ శాస్త్ర గ్రంధాన్నైనా ప్రారంభించేటప్పుడు మంగళకరమైన శబ్దంతో ప్రారంభించటం శాస్త్రసాంప్రదాయం. అందుకే ఈ బ్రహ్మసూత్రాలను అధ అనే మంగళవాచకంతో

Sample: WWW.SRICHALAPATHIRAO.COM

ప్రారంభిస్తున్నాడు వ్యాసుడు. పూర్వమీమాంస అనబడే ధర్మసూత్రాలను కూడా 'అధ' తోనే ప్రారంభించారు. అలాగే అనేక ఉపనిషత్తులను కూడా 'అధ'శబ్దంతో ప్రారంభించటం జరిగింది. అధ అశ్వలాయనో భగవంతం ....(కైవల్య). ఇక భగవద్గీత కూడా నిజమైన ప్రారంభం 'అధవ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజ' తోనే ప్రారంభం అంటారు. కనుక ఇది కూడా అధతో ప్రారంభమైంది. ఇలా అనేక శాస్త్రాలు 'అధ' అనే మంగళ వాచకంతో ప్రారంభమైనవి. మరికొన్ని శాస్త్రాలు 'ఓం' అనే మంగళ వాచకంతో ప్రారంభమైనవి.

అధ అంటే తరువాత అని అర్థం చెప్పుకున్నాం. దేని తరువాత? - అనే ప్రశ్న వస్తుంది. 'సాధనచతుష్టయ సంపద పొందిన తరువాత' అని గ్రహించాలి.

సాధనచతుష్టయం అంటే ఏమిటి? 4 సాధనాలు అని.

*(1)* నిత్యానిత్యవస్తు వివేకం :- నిత్యమైన వస్తువేది? అనిత్యమైన వస్తువు ఏది? అనే జ్ఞానం ఉండాలి. నిజంగా ఈ లోకంలోని వస్తువులన్నీ అనిత్యమైనవే. భగవంతుడొక్కడే నిత్యం. అందుకే "నిత్య వస్త్వేకం బ్రహ్మ తద్ వ్యతిరిక్తం సర్వం అనిత్యం" అని తత్త్వబోధలో తెలియజేశారు శంకరాచార్యులవారు. నిత్య జీవితంలో మనం ప్రతి విషయంలోను ఇది నిత్యమా? అనిత్యమా? అని ప్రశ్నించుకుంటూ ఉంటే సమస్తము

-

Sample: WWW.SRICHALAPATHIRAO.COM

**"బ్రహ్మసూత్రములు" గ్రంధంపై పూజ్య గురుదేవులు "శ్రీ దేవిశెట్టి చలపతిరావుగారు"" చేసిన వ్యాఖ్య *500* పేజీలకు పైగా ఉన్న పుస్తకము మా వద్ద లభిస్తుంది**

***Ebook* మీరు *DOWNLOAD* చేసుకొనుటకు రూ.*500/-* లేదా పుస్తకమును మేము మీ ఇంటికి పంపాలంటే రూ.*560/-* (*courier* ఖర్చులతో కలిపి) *ONLINE* లో చెల్లించుటకు -**

***Click & Pay us through Paytm :***

***http://srichalapathirao.com/images/paytm_QR_WWWSRICHALAPATHIRAOCOM.png***

**లేదా**

***Pay us through Net Banking :***

***http://srichalapathirao.com/PDFs/Bank.pdf***

**మీకు మరేదైనా సందేహం ఉంటే *care@srichalapathirao.com* కు ఈమెయిల్ పంపగలరు లేదా *+91 80085 39770 OR +91 95388 58115* నంబర్లకు ఫోన్ చేయగలరు**

Refer : ***http://www.srichalapathirao.com/catalog***